

ఉత్తరం

'వసుంధర'

రైలులోంచి దిగుతూనే రుసరుసలాడుతూ చూసింది దీప అటుపైన భర్త వంక చూడకుండా విసవిసా నడిచింది.

శ్రీనివాస్ హతాశుడైపోయాడు. భార్య పుట్టింటికి వెళ్ళి మూడు వారాలయింది. అతడామెకోసం వేయి కన్నులతో ఎదురుచూస్తున్నాడు. ఆమెతో ఎన్నో మాట్లాడాలనుకున్నాడు. కానీ దీప కోపంతో వచ్చింది. తామింకా కలుసుకునైనా మాట్లాడుకోలేదు. అప్పుడే ఆమెకు అంత కోపమెందుకు వచ్చింది?

పుట్టింట్లో ఏదో జరిగి ఉండాలి. అయితే అత్తమీద కోపం దుత్తమీద చూపడం అన్యాయం కాదా?

దీపచేతిలోని సూట్‌కేసును బలవంతాన లాక్కున్నాడు. అదికాస్త బరువుగా ఉండడంవల్ల ఆమె అడ్డే అభ్యంతరం చెప్పలేదు. కానీ అతడివంక చూడలేదు. మాట్లాడలేదు.

ఇద్దరూ రిక్షాలో ఇల్లు చేరుకున్నారు. దారిలో రిక్షాలో ఆమెను పలకరించాలనుకున్నాడు శ్రీనివాస్. కానీ ఆమె బుసలు కొడుతూండడం గమనించి ఊరుకున్నాడు. దీపకు కోపంవస్తే ఒళ్ళుపై తెలియదు. ఆమెను పలకరించడం రిక్షావాడి ముందు తన పరువు తీసుకుందుకే అవుతుందని భయపడ్డాడు శ్రీనివాస్.

ఇల్లు చేరాక ఇంట్లో కాసేపు మౌనం రాజ్యమేలింది. ఆఖరికి శ్రీనివాస్ ధైర్యంచేసి— "ఏమయింది దీపా—అలా ఉన్నావు? మీ యింట్లో నిన్నెవరైనా ఏదైనా అన్నారా?" అన్నాడు.

దీప విసురుగా తల ఎత్తింది. కళ్ళలోంచి అగ్నికురిపిస్తూ "ఈ ప్రపంచంలో మీరు తప్ప నన్ను బాధించాలనుకునే వారే లేరు"—అంది.

శ్రీనివాస్ తెల్లబోయాడు. "నేనా! నేనేం చేశాను—ఇప్పుడే కదా నీవు వచ్చింది—"

"నే నింటికి వెళ్ళి ఎన్నాళ్ళయింది?"

"మూడు వారాలు. నువ్వు వెళ్ళినప్పట్నించీ క్షణమొక యుగంలా గడుపుతున్నాను–తెలుసా?"

"అన్నీ అబద్ధాలు –" అంది దీప– "అదేనిజమైతే మీరు నాకు కనీసం ఒక్కటైనా ఉత్తరం రాసేవుండేవారు"–

అప్పటికి శ్రీనివాస్‌కి ఆమె కోప కారణం అర్థమై "నేను నీకు ఓ ఉత్తరం రాశాను అందలేదా?" అన్నాడు.

"రాస్తే ఎందుకు అందదు?"

"ఏమో – పోస్టులో మిస్సయి ఉండవచ్చు–"

"కల్లబొల్లి కబుర్లు చెప్పకండి. మీరు ఉత్తరం రాస్తే నాకు తప్పక అందుతుంది. మీరుత్తరం రాశానంటే నేను నమ్మను"

"నువ్వు నమ్మాలంటే నే నేం చేయాలి?"

"నామీద ఒట్టువేయండి–"

శ్రీనివాస్ వెంటనే ఒట్టు వేశాడు.

దీప తెల్లబోయి – "అబద్ధానికి ఎంతగా తెగించారు? అబద్ధాలాడి నా మీద ఒట్లు కూడా వేసేస్తున్నారన్నమాట–" అంది.

దీనికి పెద్ద సిద్ధాంతం. అది పక్కింటిదాకా చేరింది

పక్కింట్లో శోభ, శేఖరం ఉంటున్నారు. ఇద్దరూ కూడా శ్రీనివాస్ కుటుంబంతో చనువుగా ఉంటారు. వివాహానికి ముందు శేఖరం, శ్రీనివాస్ మంచి స్నేహితులు. ఆ స్నేహం ఇంకా బాగా కొనసాగుతూనే ఉంది.

శేఖరానికి ఎదుటివాళ్ళను ఏడిపించడం సరదా. ఆ రోజే దీప ఊర్నించి వస్తుందని అతడికి తెలుసు. వస్తూనే భార్యాభర్తలమధ్య ఏదో గొడవ ప్రారంభమైందని అతడికి అర్థమయింది. అతడు శోభతో "వాళ్ళొచ్చినట్లున్నారు పద పిలిచి కాస్త కాఫీ ఇద్దాం" అన్నాడు. కాఫీ అగ్నికి అజ్యం పోయాలని అతని అభిలాష.

దీప, శ్రీనివాస్‌లు ఇంకా గొడవపడుతూండగానే శేఖరం వాళ్ళింటి తలుపు తట్టాడు.

'హమ్మయ్య' అనుకున్నాడు శ్రీనివాస్. వచ్చిం దెవరైతేనేం తాత్కాలికంగా తనకు మోక్షం లభించింది. అతడే వెళ్ళి తలుపుతీసి శేఖరం దంపతులను సాదరంగా ఆహ్వానించాడు.

"చాలాకాలం తర్వాత కలుసుకున్న దంపతులు కదా–మిమ్మల్ని డిస్టర్బ్ చేయకూడదనుకున్నాం కానీ మీరే మమ్మల్ని డిస్టర్బ్ చేశారు. అందుకని పిలిచి కాస్త కాఫీ ఇద్దామనుకుంటున్నాం–" అన్నాడు శేఖరం.

దీప కాస్త సిగ్గుపడింది–తమ గొడవ పొరుగింటిదాకా వినబడినందుకు. దాన్నించి బయటపడడం కోసం ఆమె "చూడండన్నయ్యగారూ – మూడు వారాలు పుట్టింట్లో ఉంటే ఈయన నేనెలాగున్నానోనని ఒక్కటంటే ఒక్క–



ఉత్తరం కూడా రాయలేదు. పైగా రాశానని అబద్ధమాడుతున్నారు–" అంది.

శేఖరం వెంటనే–"బాగుందమ్మా మీ ఆడవాళ్ళ వరస! తను పుట్టింట్లో ఉంటే నానుంచి రోజుకో ఉత్తరం అందితే సిగ్గుతో చచ్చిపోతున్నానని మా ఆవిడంటుంది"– అన్నాడు. అతడు చెప్పాలనుకున్నది అదికాదు. తను భార్యకు రోజుకో ఉత్తరం రాస్తాడని దీపకు తెలియాలి. అప్పుడే అగ్నిలో ఆజ్యం పడుతుంది.

"చాల్లెండి–మిమ్మల్ని ఉత్తరం రాసినందుకు నే నెప్పుడూ తప్పు పట్టలేదు" అంది శోభ వెంటనే–తను సిగ్గుపడుతూ.

శ్రీనివాస్‌కు శేఖరం ఉద్దేశ్యం అర్థమయింది. అతడి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. భయంభయంగా దీప వంక చూశాడు; ఆమె కోపాన్ని అణచుకుంటోంది. వాళ్ళిద్దరూ వెళ్ళగానే అగ్నిపర్వతం పేల్తుంది.

శేఖరం దంపతులు కాసేపుంటే బాగుండునని అతడనుకున్నాడు. కానీ శేఖరం అక్కడ ఎంతోసేపుండలేదు. పోస్టల్ డిపార్టుమెంటు ఎంత శ్రద్ధగా పని చేస్తున్నదీ–పోగిడి ఎవరికిఅబద్ధాలు చెప్పినా భార్యకు చెప్పకూడదని నీతులు చెప్పి–ఇప్పుడే కదా వచ్చారు. త్వరగా తెమిలి

కాఫీకి రండి-" అని భార్యతోసహా వెళ్ళిపోయాడు శేఖరం. వాళ్ళు పోగానే శ్రీనివాస్ భయంభయంగా తలుపులువేయబోతుండగా చాకలి వచ్చాడు. వాడిని చూడగానే శ్రీనివాస్కు కౌగిలించుకుని ముద్దుపెట్టుకోవాలన్నంత అభిమానం కలిగింది. అభిమానంగా - "రా....రా.... అమ్మగారొచ్చేశారు-" అన్నాడు. ఊహించని ఈ ఆహ్వానానికి ఆశ్చర్యపడుతూ చాకలి లోపలకు వచ్చాడు. శ్రీనివాస్కు సాధారణంగా చాకలిని చూస్తే చిరాగ్గా ఉంటుంది.

"దీపా-నేను పద్దు సరిగ్గా వేయనంటావని ఈ మూడువారాలూ నేను చాకలికి బట్టలు వేయలేదు-" అని శ్రీనివాస్ వినయంగా భార్యకు చెప్పాడు.

దీప మాట్లాడలేదు. ఆమె చకచకా చాకలికి బట్టలువేసింది. అప్పుడు శ్రీనివాస్ చొక్కా జేబులోంచి ఓ కవరు బయటపడింది.

ఆ కవరు అతికించి ఉంది. దానిమీద స్టాంపులున్నాయి. అడ్రసు రాసి ఉంది. అది దీప పుట్టింటి అడ్రసు.

దీప చటుక్కున ఆ కవరు తెరిచి అందులోని ఉత్తరం తీసింది.

అది శ్రీనివాస్ భార్యకు రాసిన ఉత్తరం. భార్యపై తనకు గల ప్రేమను, ఆమెకై తాననుభవిస్తున్న విరహాన్ని వర్ణిస్తూ అతడు త్తరం వ్రాశాడు. ఉత్తరం చదవగానే దీప కోపం అంతాపోయింది.

ఆమె ఉత్తరాన్ని కవర్లో పెట్టేసి చాకలిని పంపేశాక భర్తవద్దకు వెళ్ళి- "ఇదేమిటండీ-?" అనడిగింది.

శ్రీనివాస్ ఆ కవర్ని పరిశీలించి- "అరే - ఇది నేను పోస్టుచెయ్యలేదా?" అన్నాడు.

భర్త పరధ్యానం విషయం దీపకు తెలుసు.

"ఈ ఉత్తరం నాకు అందిఉంటే ఒక వారంరోజులు ముందే వచ్చిఉండేదాన్ని-" అందామె భర్తవంక ప్రేమగా చూస్తూ.

"నువ్వు వెళ్ళిన నాలుగు రోజులకిది రాశాను. పోస్టు చేశాననే అనుకున్నాను. నన్ను క్షమించు దీపా!" అన్నాడు శ్రీనివాస్.

దీప అతడిని క్షమించేసింది. తర్వాత పది నిముషాల్లో తెమిలి ఇద్దరూ శేఖరం ఇంటికి వెళ్ళారు. వెళ్ళేటప్పుడు శ్రీనివాస్ తన ఉత్తరాన్ని కూడా తీసుకొని వెళ్ళాడు.

భార్యాభర్త లిద్దరూ ముసిముసిగా నవ్వుకుంటూ ప్రసన్న వదనాలతో కులాసాగా తన ఇంటికి వచ్చేసరికి శేఖరం తెల్లబోయాడు.

"ఏం శ్రీనివాస్! సమస్య శాంతియుతంగా పరిష్కారమైపోయిందా?" అనడిగాడు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

శ్రీనివాస్ అతడికి జరిగింది చెప్పి తన జేబులోని కవరు చూపించాడు. శేఖరం చలించకుండా "మొత్తంమీద

అసాధ్యుడివే- మంచి ట్రిక్కే వేశావు" అన్నాడు.

"ట్రిక్కేమిటి?" అన్నాడు శ్రీనివాస్ ఆశ్చర్యంగా.

"చెబుతాను. ముందు డైనింగ్ టేబిల్ దగ్గరకు పోదాం" అన్నాడు శేఖరం. అంతా అక్కడకు పోయి కూర్చున్నారు. శోభ ప్లేట్స్‌లో ఇడ్లీలు తెచ్చి అందరి ముందు పెట్టింది.

"శోభా! నీ అన్న చాలా గట్టివాడు. నిన్నటిరోజు రాత్రికి రాత్రి ఓ ఉత్తరం రాసి- అది పాత చొక్కా జేబులో పెట్టి ఎన్నాళ్ళక్రితమో రాసిందని నమ్మించేశాడు మా చెల్లెల్ని"- అన్నాడు శేఖరం.

శ్రీనివాస్‌కి ఇడ్లీ ముక్క గొంతులో అడ్డంపడింది. అతను కాసిని నీళ్ళు తాగి "అబద్ధం, ఆ ఉత్తరాన్ని నేను చాలా కాలం క్రితమే రాశాను-" అన్నాడు.

"అక్షరాలు చూసి ఉత్తరం ఎప్పుడు రాసిందీ తెలుసుకోవచ్చు" అన్నాడు శేఖరం.

శేఖరం సైంటిస్టు. ఆ విషయం దీపకు తెలుసు. అయితే అతను తనను ఆటపట్టిస్తున్నాడని ఆమెకు తెలియదు. అందుకే "ఎలా?" అని అడిగింది.

సిరాను అక్షరరూపంలో కాగితం మీదకు మార్చాలి—అది రోజురోజుకు మార్పు చెందుతుంది. ఆ మార్పుల్ని గమనించడానికి కొన్ని సునిశిత సాధనాలు మా లాబొరేటరీలో ఉన్నాయి" అన్నాడు శేఖరం.

"అయితే ఈ ఉత్తరం మీ దగ్గరే ఉంచి- అదెప్పుడు రాసిందో కనుక్కొని నాకు చెప్పాలి" అంది దీప.

శ్రీనివాస్ తెల్లబోయి "దీపా నువ్వు నన్ననుమానిస్తున్నావా- ఈ విషయంలో నీ కింత పట్టుదల ఎందుకు?" అన్నాడు.

"ఎందుకా - మీరు నా మీద ఒట్టు వేశారు కనుక....."

శ్రీనివాస్ కేంచేయాలో తోచలేదు. శేఖరం వినోదాన్ని అర్థం చేసుకునే స్థాయికి- దీప ఇంకా ఎదగలేదు. ఆమె అంతా నిజమేనని భ్రమిస్తోంది.

అతడు ఆ రాత్రంతా ఈ విషయం దీపకు నచ్చజెప్పాలని, పగలంతా శేఖరాన్ని కాకపట్టాలని అనుకున్నాడు.

టిఫిన్ తిని ఇద్దరూ తమ ఇంట్లోకి వెళ్ళారు- శ్రీనివాస్ భార్యకు శేఖరం మన సత్యాన్ని వివరించి-"రేపు అటదాక వేళ ఈ ఉత్తరం నిన్ననే వ్రాయబడింది అని చెబితే నీవు నమ్మకూడదు" అన్నాడు.

"ముందరి కాళ్ళకు బంధం వేయకండి" అంది దీప కోపంగా.

అయితే ఆమె కోపం ఎంతోసేపు నిలువలేదు. తర్వాత ఇద్దరూ ఎన్నో విశేషాలు ముచ్చటించుకున్నారు. ఆ రోజు సెలవుకావడంవలన మధ్యానం మేట్నీ సినిమాకు కూడా వెళ్ళారు.

శ్రీనివాస్‌కు మాత్రం మనసులో బెంగగానే ఉంది. దీప చూపే ప్రసన్నత తాత్కాలికం. రేపు శేఖరం మళ్ళీ తన జీవితంలో తుఫాను సృష్టిస్తాడు.

సినిమా చూసి, హోటల్లో టిఫిన్ తిని ఇద్దరూ ఇల్లు చేరారు. ఇల్లు చేరిన కాసేపటికి శోభ వారింటికి వచ్చింది. ఉత్తరాన్నామె దీపకు అందించి "శోభా! నీకు తెలియదు. మా వారు కాస్త అల్లరి మనిషి. మా అన్నయ్యగారిని అనవసరంగా అపార్థం చేసుకోకు" అంది.

"అంటే?" అంది దీప

"ఆయన చెప్పినవన్నీ అబద్ధాలు. నువ్వు కోపంగా ఉన్నావని తెలిసి ఆయన మా అన్నయ్య నిబ్బందిపెట్టడం కోసం ఏమేమో అన్నారు" అంది శోభ.

"అంటే ఆయన నీ కుత్తరాలు రాయడంకూడా అబద్ధమేనా?"

"కాదనుకో-కానీ నేను కులాసా నువ్వు కులాసా అని తెలుస్తాను- అని ఉత్తరాలు



రాసే భర్త అంటే-పోస్టుచేయకపోయినా ఇలాంటి ఉత్తరం రాసే భర్త ఉండడం పెద్ద అదృష్టం. ఈ ఒక్క ఉత్తరం-వేయి మధురానుభవాల పెట్టు-" అని శోభ అక్కణ్ణించి తొందరగా వెళ్ళిపోయింది.

ఆ సంభాషణ శ్రీనివాస్ కూడా విన్నాడు "హమ్మయ్య! శేఖరం కొన్నాళ్ళు బిజీగా ఉంటాడు. నా జోలికి రాడు" అనుకున్నాడతను.

అయితే శేఖరం ఇంట్లో ఏం జరుగుతుందో శ్రీనివాస్ తెలుసుకోలేకపోయాడు. మరి శ్రీనివాస్ మరోరకంగా చాలా రోజుల విరహం అనంతరం భార్యతో కలిసి తిరగడంలో బిజీగా ఉన్నాడు.